సాక్షి
జనగామ

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

వల్మిడి గుట్టపై నేటి నుంచి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు మొదలవుతున్నాయి. - 10లో



వరంగల్‌లో 'హరియాణ' మందు

వరంగల్‌లో హరియాణ నుంచి తెచ్చిన మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

'ఎన్నికల హామీల అమలులో పాలకులు విఫలం'

జనగామ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందాయని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీకి ఎవరూ సాటి రాలేరని, ఇటీవల కర్నాటక రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గృహలక్ష్మి, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు అమలు చేయడానికి రూ.40వేలకోట్లు వెచ్చించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు 99 హామీలు ఇచ్చి 9 మాత్రమే నెరవేర్చి మోసం చేసిందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందని, రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంపాక్ట్ ట్రైనర్‌గా మల్లేషం



జనగామ రూరల్: వ్యక్తిత్వ వికాస సర్టిఫైడ్ ఇంపాక్ట్ ట్రైనర్‌గా మండలంలోని ఎల్లంల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ బిర్రు మల్లేషం ఎంపికయ్యారు. నిజామాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన ఇంప్యాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా అందులో మంచి ప్రతిభ కనబర్చి ట్రైనర్‌గా మల్లేశం ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తన వంతుగా వ్యక్తిత్వ వికాసం ద్వారా సేవలు అందజేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

కూచిపూడిలో సహస్ర తేజ ప్రతిభ



విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని నవ్యనాటక సమితి ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌లో కూచిపూడి విభాగంలో హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పుల సతీశ్, అనూష దంపతుల కుమార్తె సహస్ర తేజ ప్రతిభ కనబర్చారు. సబ్ జూనియర్ పోటీల్లో తెలంగాణ మొదటి బహుమతి సాధించారు. సెప్టెంబర్ 2వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో సహస్రతేజ బహుమతి అందుకోనున్నారు.

వావ్.. బ్లూ మూన్




కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో గురువారం సాయంత్రం బ్లూ మూన్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. పౌర్ణమి రోజున భూమికి దగ్గరగా వచ్చి సాధారణంకంటే పెద్దదిగా, ప్రకాశవంతంగా కనిపించే సూపర్ బ్లూమూన్ నగర ప్రజలను కనువిందు చేసింది. నగరవాసులు, విద్యార్థులు ఆసక్తిగా టెలీస్కోప్ ద్వారా వీక్షించి 'వావ్ బ్లూ మూన్' అంటూ సందడి చేశారు. కార్యక్రమంలో రీజినల్ సైన్స్ సెంటర్ అధికారులు వెంకటేశ్వరరావు, అభినవ్ కాంబ్లీ, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

విద్యారణ్యపురి: హైకోర్టు స్టేను తొలగించినందున ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు చేయకపోవడంతో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోన్నతులు కల్పించాలని, వాటి ద్వారా ఏర్పడిన వేకెన్సీలను డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, బాధ్యులు ఈదుల వీరస్వామి, మనుపాటి వెంకట్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, పూర్ణచందర్, దోనం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాతాళగంగ పైపైకి

- 3.95 మీటర్లు పైకి చేరుకున్న జలాలు
- గత నెలతో పోలిస్తే 2.02 మీటర్లు వృద్ధి
- జిల్లాలో పెరుగుతున్న భూగర్భ నీటిమట్టం
- 2 లక్షల ఎకరాలకు సాగునీరు



చీటకోడూరు రిజర్వాయర్



జనగామ: కరువు సీమలో గంగమ్మ పొంగిపొర్లుతోంది. పంటల సాగు రెట్టింపైంది. దిగుబడి పెరుగుతుండగా.. ప్రకృతి వైపరీత్యాలు కొంత మేర నష్టం కలిగిస్తున్నాయి. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండడంతో అన్నదాతలు ఆనందంతో ఉన్నారు. ప్రస్తుత వానాకాలం సాగు పనులు దగ్గర పడ్డాయి. జిల్లాలో భూగర్భజలాలు ఆశించిన దానికంటే ఎక్కువే పెరిగాయి. ఇటీవల కురిసిన వర్షాలు, గోదావరి జలాల రాకతో చెరువులు, రిజర్వాయర్లు నిండి భూగర్భజలాలు రికార్డు స్థాయిలో పైకి చేరాయి. గత ఏడాది జూలైలో 9.58 మీటర్ల లోతులో ఉన్న నీటి నిల్వలు.. ప్రస్తుత ఆగస్టులో 3.95 మీటర్ల పైకి చేరాయి. దీంతో వచ్చే యాసంగి సీజన్ వరకు సాగునీటికి సమస్య తలెత్తే పరిస్థితి లేదు.

2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

జిల్లా పరిధిలో చెరువులు, రిజర్వాయర్ల కింద సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. చెరువుల పరిధిలో 51వేలు, రిజర్వాయర్ల పరిధిలో 1.50లక్షల ఎకరాల వరకు సాగునీరు పారకం అవుతోంది. కాగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు 3.23 లక్షల ఎకరాల్లో వరి, పత్తి ఇతర పంటలు సాగయ్యాయి.

జిల్లాలో భూగర్భ జలాల నిల్వల వివరాలు(మీటర్లలో)

మండలం	జూన్ 23	జూలై 23	ఆగస్టు 23
బచ్చన్నపేట	5.44	5.39	0.89
చిల్పూరు	9.7	4.85	2.43
దేవరుప్పుల	3.25	2.09	1.79
స్టేషన్‌ఘన్‌పూర్	10.35	7.08	8.08
జనగామ	4.06	2.76	1.73
కొడకండ్ల	8.01	8.65	6.57
లింగాలఘణపురం	7.03	5.09	3.74
నర్మెట	7.08	7.02	5.32
రఘునాథపల్లి	11.08	10.38	5.76
పాలకుర్తి	3.65	3.75	4.55
తరిగొప్పుల	9.05	6.25	3.88
జఫర్‌గఢ్	12.34	7.55	8.8

భూగర్భ జలాలు పెరిగాయి



నాకు 10 ఎకరాల పొలం.. మూడు బోర్లు ఉన్నా యి. 24 గంటల పాటు కరెంటు సరఫరా ఇస్తుండడంతో.. 5 ఎకరాల్లో వరి, మరో 5 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను. రెండు పంటలకు సాగునీటికి కొరత లేదు. పత్తికి డ్రిప్ సహాయంతో నీరందించే వెసులుబాటు ఉంది. ప్రకృతి సహకరిస్తే గత సీజన్‌లో జరిగిన నష్టాన్ని కొంత పూడ్చుకునే అవకాశం ఉంటుంది.

\- భూక్య బాలాజీనాయక్, రేగడితండా శివారు టీబీ తండా

రుణ లక్ష్యం రూ.3,102కోట్లు

- ఈ ఏడాది జూన్ వరకు రూ.644.20కోట్లు పంపిణీ
- మిగిలి ఉన్నది మరో తొమ్మిది నెలలే..
- త్వరలో డీఎల్ఆర్‌సీపై సమీక్ష



జనగామ: బ్యాంకర్లు రుణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యం రూ.3,102 కోట్లు కాగా.. ఇందులో 50 శాతానికి పైగా వ్యవసాయ రంగానికి కేటాయించి.. మిగతా ఇతర అనుబంధ రంగాలకు విభజించారు. ఈ ఏడాది వందశాతం రుణ లక్ష్యం చేరుకునే విధంగా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. జూన్ వరకు చేరుకున్న లక్ష్యానికి సంబంధించిన లెక్కలు పూర్తయ్యాయి. దీనిపై జూలైలో జరిగిన జిల్లా స్థాయి రివ్యూ కమిటీ(డీఎల్ఆర్‌సీ) సమీక్షలో చర్చించారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ప్రగతిపై త్వరలో డీఎల్ఆర్‌సీ మీటింగ్ నిర్వహించనున్నారు.

23 శాతం లక్ష్యం..

ఈ ఏడాదికి సంబంధించిన రుణ లక్ష్యం ప్రస్తుతం 23 శాతానికి చేరుకుంది. రూ.3,102 కోట్ల లక్ష్యంలో పంట రుణాలు రూ.1592.57కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.410.70 కోట్లు, ఎంఎస్ఎంఈ కింద రూ.297.09 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.94.49 కోట్లు, నాన్ ప్రియారిటీ సెక్టార్‌కు 59.85కోట్లు తదితర విభాగాలకు కేటాయించారు. జూన్ వరకు వ్యవసాయ, అనుబంధ రుణాలకు రూ.418.65 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ.63కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.3.76 కోట్లు, విద్యకు రూ.58 లక్షలు, నాన్ ప్రియార్టీ కింద రూ.151.91 కోట్లు అందజేశారు. 2022–23 సంవత్సరం 98 శాతం రుణ లక్ష్యం చేరుకోగా.. ఈసారి వందశాతం చేరుకునేలా ముందుకు వెళ్తున్నారు.

నూరుశాతానికి ప్రయత్నం..



జిల్లాలో ఈ ఏడాది వార్షిక రుణ లక్ష్యం నూరుశాతం పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ నేతృత్వంలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహిస్తున్నాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన రుణ లక్ష్యం రూ.3,102 కోట్లలో 50 శాతానికి పైగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ ఏడాది జూన్ వరకు రూ.644.20 కోట్లు పూర్తి చేశాం. త్వరలోనే డీఎల్ఆర్‌సీ మీటింగ్ ఏర్పాటు చేసి మిగతా లక్ష్యం వివరాలు వెల్లడిస్తాం.

\- ఎం.శ్రీధర్, లీడ్ బ్యాంకు మేనేజర్, జనగామ

9 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్షల్లో ఒక పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ.. 9 మంది విద్యార్థులు పట్టుబడగా డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. మొత్తం 1,225 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 539 మంది గైర్హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మవారికి పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఊర్ణసూత్రాల దండలను శాస్త్రోక్తంగా అమ్మవారి మూర్తికి, స్నపనమూర్తికి అలంకరించారు. పసుపు, ఎరుపు, నారింజ, నీలి, గులాబీ తదితర రంగుల ఊలు దారాల అలంకరణతో అమ్మవారు శోభాయమానంగా దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు, భక్తులు, అధికారుల కారణంగా జరిగే అపరాధాలు తొలగిపోయేందుకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శేషభారతి తెలిపారు.



ఊర్ణసూత్రాల అలంకరణలో అమ్మవారు

పరశురాములుకు 'ప్రశంస'



కన్నా పరశురాములు

జనగామ: ఉమ్మడి వరంగల్ పరిధిలో విస్తరించి ఉన్న 320ఎఫ్ 2022–23 లయనిస్టిక్ సంవత్సరం జిల్లా గవర్నర్‌గా పనిచేసిన కన్నా పరశురాములుకు అంతర్జాతీయ అధ్యక్షుడి ప్రశంసపత్రం లభించింది. కన్నా సేవలను ప్రశంసిస్తూ అంతర్జాతీయ అధ్యక్షుడు బ్రియాన్ ఇ శిహాన్ దస్తూరితో గురువారం కొరియర్ ద్వారా ప్రశంసాపత్రం చేరింది. జిల్లాలో నూతన క్లబ్‌ల విస్తరణ, సభ్యత్వ నమోదు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిధికి విరాళాల సేకరణలో విశేష కృషి చేయడంతో పాటు క్లబ్‌లకు అంతర్జాతీయ సంస్థ నిర్దేశించిన సేవా కార్యక్రమాల నిర్వహణకు మార్గ నిర్దేశం చేయడంలో పరశురాములు సఫలమయ్యారని ప్రశంసలు అందుకున్నారు. 1985లో జనగామ క్లబ్ సభ్యుడిగా చేరిన పరశురాములు 1992 జనగామ ఆబాద్ క్లబ్ చార్టర్ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణతో మొదలైన సేవా ప్రస్థానం జోన్ చైర్మన్, రీజియన్ చైర్మన్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి, పీఆర్‌ఓ తదితర బాధ్యతలను స్వీకరించారు. 2020–21లో సెకండ్ వైస్ జిల్లా గవర్నర్‌గా, 2022–23లో జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. వివిధ దేశాల పరిధిలో నిర్వహించిన పోటీలో సిల్వర్ అంబాసిడర్ గవర్నర్ అవార్డు అందుకున్న ఆయనను సీ.ఏ.6 ఏరియా లీడర్ పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్ ప్రత్యేక జ్ఞాపికతో అభినందించారు. ప్రస్తుతం 320 మల్టిపుల్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శిగా సేవలందిస్తున్న కన్నాకు అంతర్జాతీయ అధ్యక్షుడి ప్రశంసాపత్రం అందడంపై అభినందనలు కురుస్తున్నాయి.

గిరిజన సంప్రదాయాలను పరిరక్షించాలి

దేవరుప్పుల: గిరిజన సంప్రదాయాలను యువత పరిరక్షించాలని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. గురువారం మండలంలోని నల్లకుంటతండా, లకావత్‌తండా(ఎం)ల్లో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు చేసే ప్రతీ పండుగలో మానవజీవన విధానం ముడిపడి ఉంటుందన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక ఉత్సవాలు భావితరాలకు అందేలా యువత పాటుపడాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో యాకు, భాగ్య, చంద్రు. హచ్చ, జగన్‌నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవంలో లక్ష్మీనారాయణనాయక్

ఘనంగా 'రక్షా బంధన్'

- ఇంటింటా రాఖీ వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ప్రయాణికులతో రద్దీగా మారిన ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు



వర్ధన్ ఆశ్రమంలో రాఖీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

జనగామ/జనగామ రూరల్ : అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆడబిడ్డలు, సోదరీ సోదరులతో లోగిళ్లు సందడిగా మారాయి. రాఖీ కట్టిన అక్కా చెల్లెళ్లకు అన్నాదమ్ములు కట్నకానుకలు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. స్నేహానికి ప్రతిరూపమైన చిన్ననాటి మిత్రులు సైతం మతాలకు అతీతంగా రాఖీలు కట్టుకుని పండుగ చేసుకున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మిఠాయి, పూలు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగింది. జిల్లాతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. ఆర్టీసీ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించింది. ఇదిలా ఉండగా.. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకుర్తిలోని పంచగుళ్ల ఆలయంలో పద్మశాలీలు నూలు పోగుల పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

ప్రజాప్రతినిధులకు రాఖీలు

రాఖీ పండుగ పురస్కరించుకుని ప్రజాప్రతినిధులకు పలువురు రాఖీలు కట్టారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి జనగామ జెడ్పీటీసీ సభ్యురాలు నిమ్మతి దీపికామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా ప్రతినిధులు కౌన్సిలర్లు జూకంటి లక్ష్మీ శ్రీశైలం, పేరిని స్వరూప, పగిడిపాటి సుధాసుగుణరావు, బండ పద్మయాదగిరిరెడ్డి తదితరులు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి జనగామ మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు, 12వ వార్డు కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి, కేసిరెడ్డిపల్లి సర్పంచ్ మల్లవరపు దివ్యఅరవింద్‌రెడ్డి, ఎల్లంల సర్పంచ్ సుజాత, టీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు చెంచారపు పల్లవి, పెంబర్తి ఉప సర్పంచ్ రేఖ, కౌన్సిలర్ ఎండీ.సమాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మహిళలు రాఖీలు కట్టారు. కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తతోపాటు కుటుంబంలోని ఏడుగురి అన్నదమ్ములకు సోదరి రాజకళ రాఖీలు కట్టింది.



జనగామ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వరాలయంలో..

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ వి.రఘుబాబు అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధి కోనాయిచలం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. అలాగే పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 69 పశువులకు వైద్య చికిత్స చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యవర్గ సభ్యుడు చింతకుంట్ల ఉపేందర్‌రెడ్డి, ఉప్పుగల్లు పశువైద్యాధికారి శ్రీనాథ్, గోపాలమిత్రలు రాజేశ్వర్‌రావు, లచ్చయ్య, నాగేష్, రాజు, రవీందర్, స్వప్న, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



కోనాయిచలంలో పశువు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న అధికారులు

సీఐల చూపు 'అర్బన్' వైపు!

- లాంగ్ స్టాండింగ్‌లను తప్పించేందుకు సీఎం పేషీ నుంచి సిఫార్సులు
- సస్పెండైనా.. హనుమకొండ స్టేషన్‌పైనే గురి



కాజీపేట అర్బన్: అబ్కారీ శాఖ మల్టీజోన్ పరిధిలో ఎక్సైజ్ సీఐలుగా పదోన్నతి పొందిన ఎస్సైలు సీఐ సీటు దక్కించుకునేందుకు ఏకంగా సీఎం పేషీ నుంచి సిఫార్సులతో విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 16 నెలల క్రితం మల్టీజోన్ విభజనలో భాగంగా 28 మంది ఎస్సైలు సీఐలుగా పదోన్నతి పొందారు. అయినప్పటికీ సీఐ సీట్లు ఖాళీలు లేని కారణంగా కొన్ని నెలలు అదే స్టేషన్‌లో ఎస్సైలుగా కొనసాగారు. కాగా.. రెండు నెలల క్రితం చెక్‌పోస్ట్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో అబ్కారీ శాఖ వారిని సర్దుబాటు చేసింది.

అర్బన్‌పై ఆశలు!

వరంగల్ అర్బన్ జిల్లాలోని హనుమకొండ, కాజీపేట, వరంగల్ అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్ల వైపు చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సీఐల చూపుపడింది. కాగా.. కాజీపేటకు నెల క్రితం సీఐ బదిలీపై వచ్చారు. దీంతో హనుమకొండ, వరంగల్ అర్బన్, ఖిలా వరంగల్ ఎక్సైజ్ స్టేషన్లలోని సీఐల సీటుపై నజర్ వేసినా.. పదోన్నతి పొందిన సీఐలు ఏకంగా సీఎం పేషీ నుంచి, స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని పోస్టింగ్ లెటర్లను సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లాంగ్ స్టాండింగ్‌లకు ఎఫెక్ట్

వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లలో సీఐలు ఆరేళ్లుగా అదే స్టేషన్లలో కొనసాగుతున్నారు. దీంతో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న సీఐలను తప్పించి తమకు పోస్టింగ్ కల్పించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ పదోన్నతి పొందిన సీఐలు చక్రం తిప్పుతున్నారు. వరంగల్ అర్బన్ పరిధి ఎక్సైజ్ స్టేషన్ల సీఐలకు సీటు గండం పొంచి ఉంది.

సస్పెండైనా.. హనుమకొండ వైపు

గతంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెండై ఇటీవల సీఐగా పదోన్నతి పొందిన ఓ సీఐ హనుమకొండ ఎక్సైజ్‌స్టేషన్‌పై కన్నేశారు. పోస్టింగ్ సాధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. నెల క్రితం బదిలీపై వచ్చిన కాజీపేట సీఐని తప్పించేందుకు సీఎం పేషీ నుంచి సిఫారసు లెటర్‌ను తెచ్చుకున్నారు. కాగా.. కాజీపేట సీఐ లాంగ్ స్టాండింగ్ కాదు ఫ్రెష్‌గా బదిలీపై వచ్చినట్లు ఉన్నతాధికారులు వివరణ ఇచ్చి పోస్టింగ్ నిలిపివేసినట్లు సమాచారం.

రేపటి నుంచి ప్రీ-లోక్ అదాలత్

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.రాధాదేవి

వరంగల్ లీగల్: శనివారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రీ–లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి తెలిపారు. గురువారం జిల్లా కోర్టులోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రీ–లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజీపడదగు క్రిమినల్, సివిల్, భూతగాదాలు, మోటారు వెహికల్ యాక్సిడెంట్, వివాహ, కుటుంబ తగాదాలు, బ్యాంక్, చెక్‌బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, కన్స్యూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈ–చాలన్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కక్షిదారులు, తమ కేసుల ను వారికి వీలైన రోజునే పరిష్కరించుకునేలా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గంతో కేసులు పరిష్కరించుకొని ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాల ని కోరారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలి పారు. ఎలాంటి సందేహాలు, సలహాలకు, న్యాయ సహాయం కోసం ఆయా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలన్నారు. మరింత సమాచారం కోసం 93918 07362 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే.. ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు వరంగల్ జిల్లా కోర్టుతో పాటు నర్సంపేట కోర్టులో నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రౌడీషీటర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో బుధవారం రౌడీషీటర్ ఎస్‌డీ నజీర్ (37) దారుణ హత్యకు గురయ్యాడు.ఈ ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో హత్య చేసి రైలులో పరారైన నిందితుల గురించి ఆరా తీస్తున్నారు. హత్యలో ఎంత మంది భాగస్వాములయ్యారు..? రైలు ఎక్కిఎటు వైపు పారిపోయారు..? ఎందుకు హతమార్చాల్సి వచ్చిందనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. హత్య ప్రదేశంలో లభ్యమైన సీసీ ఫుటేజీల ఆధారంగా కూడా నిందితుల వివరాలు ఇప్పటికే సేకరించినట్లు తెలుస్తోంది. హత్య చేసి పరారవుతున్న క్రమంలో రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి ఇప్పటికే చిక్కినట్లు సమాచారం. కేసును త్వరగా ఛేదించడానికి ఇప్పటికే మిల్స్‌కాలనీ పోలీసులు రైల్వే పోలీసు అధికారుల సహకారం తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచార ప్రకారం నిందితులు రైలు ఎక్కి ఉత్తర్‌ప్రదేశ్‌కు పరారవుతుండగా రైల్వే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను వరంగల్‌కు తీసుకొచ్చేందుకు స్థానిక పోలీసులు వెళ్లినట్లు సమాచారం. నిందితులను శుక్రవారం సాయంత్రం వరకు వరంగల్ తీసుకొచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మునావర్ దేవ్ సింగ్ (ఫైల్)

కురవి: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మునావర్ దేవ్‌సింగ్(45)కు ఎకరంన్నర భూమి ఉంది. గతేడాది ఎకరం భూమిలో మిరప తోట సాగు చేశాడు. చేతికొచ్చే సమయంలో నల్లిరోగంతో పంట ఎండిపోయింది. దీంతో పంట కోసం చేసిన అప్పులు పెరిగాయి. అప్పులు తీరక మనస్తాపానికి గురైన ఆయన.. బుధవారం రాత్రి పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటినా మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. మృతుడికి భార్య కళ, ఇద్దరు కుమారులున్నారు.



రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు రాఖీ కడుతున్న తన చెల్లెలు అనంత లక్ష్మి



దోర్నకల్ : ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు బొట్టు పెడుతున్న ఆయన సోదరి



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క



వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి మునిగాల సరోజన

అనురాగం.. ఆప్యాయత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైభవంగా రాఖీ పౌర్ణమి

అక్కా తమ్ముడు, అన్నా చెల్లెల ప్రేమానురాగాలు ప్రతీక రాఖీ. ఈ పండుగ వెలకట్టలేని.. వదులు కోలేని మమతానురాగాలకు ప్రతిరూపం. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సోదరిమణులు తమ సోదరులకు రాఖీ కట్టి రక్తసంబంధాన్ని చాటిచెబుతారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడపడుచులు తమ తోబుట్టువులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకున్నారు. అనంతరం అన్నదమ్ములు.. అక్కాచెల్లెళ్లకు తమకు తోచిన విధంగా కానుకలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, ఆడపడుచుల రాకతో ఆయా కుటుంబాల్లో సందడి నెలకొంది. అలాగే, గ్రామాలు, పట్టణాలు కళకళలాడాయి.



బ్రహ్మకుమారీస్ రక్షా బంధన్ వేడుకల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు



కమలాపూర్ : బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు రాఖీ కడుతున్న సోదరి నీలమ్మ



హనుమకొండలోని నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు



హైదరాబాద్‌లో రాఖీ కట్టిన జనగామ మహిళా ప్రతినిధులకు భోజనం వడ్డిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్సీ 'కడియం'కు రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు విజయ



నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ దార్ల రమాదేవి



భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మహిళలు



ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళ



మరిపెడ మండలం ఎల్లంపేటలో తన అన్న రవిచంద్రకు రాఖీ కడుతున్న చెల్లెలు, మహబూబాబాద్ ఎంపీ కవిత

వెల్లివిరిసిన మతసామరస్యం..

- ముస్లింకు 23 ఏళ్లుగా రాఖీ కడుతున్న హిందూ యువతి..



మహమూద్‌కు రాఖీ కడుతున్న శిరీష

కాజీపేట : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిక రాఖీ. ఈ పండుగకు కుల, మతాలతో సంబంధం లేదు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. కాజీపేట పట్టణానికి చెందిన ముస్లిం యువకుడు మహమూద్‌కు హిందూ యువతి శిరీష 23 సంవత్సరాలుగా రాఖీ కడుతోంది. చిన్నప్పటి నుంచే ఇరువురి కుటుంబాలకు మంచి సంబంధ బాంధ్యవ్యాలు ఉండేవి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం పండుగ సందర్భంగా శిరీష.. మహమూద్‌కు రాఖీ కడుతోంది. పెళ్లయినా భర్త వినయ్‌తో వచ్చి రాఖీ కట్టి ఆప్యాయతను చాటుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం కూడా మహమూద్ ఇంటికి వచ్చిన శిరీష.. మరోసారి రాఖీ కట్టి సోదర భావం చాటుకుంది.

రేపు మెగా జాబ్‌మేళా

రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన క్యూఆర్ కోడ్

హన్మకొండ అర్బన్ : నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ఈనెల 2న (రేపు) టీఎస్‌కేసీ, డీఈఈటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ లేదా http://bit.y/3YNonUG లింక్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న వాగ్దేవి కళాశాల బస్సు
- తిమ్మాపురం క్రాస్ వద్ద ఘటన
- గోవిందరావు పేటలో విషాదం



ప్రమాద తీరును పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్ : సోదరితో రాఖీ కట్టించుకుని త్వరగా వచ్చేస్తానంటూ ఓ వ్యక్తి బైక్ తీసుకుని కొద్ది దూరం బయల్దేరాడు. ఇంతలోనే మృత్యువు అతడిని బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన గురువారం సాయంత్రం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై తిమ్మాపురం క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ములుగు జిల్లా గోవిందరావు పేటకు చెందిన కంచర్ల విజయ్‌కుమార్(36) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే లోడ్‌తో వరంగల్‌కు వచ్చాడు. వరంగల్ హంటర్ రోడ్డులో లారీని పార్కింగ్ చేశాడు. రాఖీ కట్టుకుని ఇప్పుడే వస్తానని క్లీనర్‌కు చెప్పి గంజు నర్సయ్య అనే వ్యక్తి బైక్ తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద మామునూరు నుంచి వరంగల్ వైపునకు విద్యార్థులతో బయలుదేరిన వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బస్సు అతివేగంతో బైక్‌ను ఢీకొంది. దీంతో విజయ్‌కుమార్‌కు తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ప్రమోద్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీమున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

లైంగికదాడి నిందితుడికి 20 ఏళ్ల జైలు

నెల్లికుదురు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించి బాధితురాలికి రూ.4 లక్షల సాయం అందిస్తూ పోక్సో కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి పి.చంద్రశేఖర ప్రసాద్ తీర్పు ఇచ్చారని ఎస్సై కె.క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జాదు తండాకు చెందిన గుగులోతు లచ్చిరాం గత సంవత్సరంలో ఓ బాలికపై సామూహిక లైంగికదాడి కేసులో అప్పటి ఎస్సై పి.జితేందర్ పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి తొర్రూరు డీఎస్పీ రఘు సాక్ష్యాధారాలు సేకరించి చార్జీషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీంతో జిల్లా న్యాయ స్థానం లచ్చిరాంకు 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితునికి శిక్షపడేలా చేసిన పీపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు పోలీసు అధికారులను ఎస్పీ చంద్రమోహన్ అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

కొడుకు గొంతు కోసి హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. మండలంలోని ఆలేరుకు చెందిన జనగాం నరేష్ తన భార్య మౌనికపై అనుమానంతో కొడుకు నవదీప్ గొంతుపై కత్తితో కోయగా గాయమైంది. దీనిపై మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్‌లో 'హరియాణ' మందు..

- అక్కడ తక్కువ ధరకు కొని.. ఇక్కడ ఎక్కువకు విక్రయం
- స్కూల్ బ్యాగుల్లో తీసుకొస్తున్న అక్రమార్కులు
- గుర్గావ్ నుంచి రైలు మార్గం ద్వారా వరంగల్‌కు చేరవేత
- ఆపై ఇంట్లోనే విక్రయం.. రైల్వే స్టేషన్‌లో పోలీసులకు చిక్కిన వ్యక్తి
- 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్లు స్వాధీనం



హరియాణ మద్యంతో పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్‌లో హరియాణ లిక్కర్ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి రైలుమార్గం ద్వారా వరంగల్ తరలిస్తున్నారు. అనంతరం ఇంట్లోనే యథేచ్ఛగా మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వరంగల్ పోలీసులు గురువారం వరంగల్ తుమ్మల కుంటకు చెందిన మనగాని గోవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. గోవింద్ ఎప్పటిలాగే హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి ఇండియన్ మేడ్ ఫారెన్ లిక్కర్ (ఐఎంఎఫ్ ఎల్) బాటిళ్లను స్కూల్ బ్యాగులో తీసుకుని రైలు మార్గం ద్వారా వరంగల్ చేరుకున్నాడు. ఇంటికి వెళ్తున్న క్రమంలో టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అనంతరం రూ.56,720 విలువైన 51 బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్ 69 ఫుల్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

రేటు రెట్టింపు...

హరియాణ ప్రభుత్వం ఇటీవల మద్యం ధరలను సడలించింది. ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్‌ను తగ్గించడంతో ఇతర రాష్ట్రాల కంటే అక్కడే తక్కువ ధరకు లభిస్తోంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్కడ మద్యం కొనుగోలు చేసి వరంగల్ తీసుకొచ్చి ఎక్కువ ధరకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. ఈ కోవలోనే మనగాని గోవింద్ కూడా హరియాణలోని గుర్గావ్‌కు వెళ్లి అక్కడి నుంచి బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ స్టాగ్, వ్యాట్69 ఫుల్ బాటిళ్ల కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. అక్కడ బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిల్ రూ.680 ఉండగా ఇక్కడ రూ.1320కు, రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్ రూ.400 ఉండగా ఇక్కడ రూ.860, వ్యాట్ 69 ఫుల్ బాటిల్ రూ.2,000 ఉండగా ఇక్కడ రూ.3,800 కు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఇతనే కాకుండా చాలా మంది హరియాణ, రైల్వే పోలీసుల కనుగప్పి ఈ లిక్కర్ అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో నగర పోలీసులు నిఘా పెంచారు. ఈ నేపథ్యంలోనే ఇంతేజార్‌గంజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన గోవింద్‌ను తనిఖీ చేశారు. ఇందులో తన బ్యాగులో లిక్కర్ లభించగా ఈ దందా వెలుగులోకి వచ్చింది. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్ఐ నర్సింహాతోపాటు ఇంతేజార్‌గంజ్ పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని భర్త పట్టించుకోవడం లేదని..

- వివాహిత ఆత్మహత్య
- నార్లవాయిలో ఘటన



నాగమణి(ఫైల్)

సంగెం: మద్యానికి బానిసైన భర్త.. ఇంటి బాగోగులు చూడడంలేదని, ఎంత చెప్పినా మారడం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నార్లవాయి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన చిలువేరు జానుకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు ఝాన్సీని సంగెం మండలంలోని నార్లవాయికి చెందిన యువకుడితో వివాహం జరిపించాడు. చిన్న కూతురు నాగమణి(23) అక్క ఇంటికి వచ్చిపోతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మొలుగూరి ప్రదీప్‌తో పరిచయం ఏర్పడింది. 5 సంవత్సరాల క్రితం ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి లోకేష్(4), స్నేహ(2) ఉన్నారు. ఈ క్రమంలో ప్రదీప్ ఏమి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబం బాగోగులు పట్టించుకోవడం లేదు. దీనిపై భర్తకు ఎంత చెప్పినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన నాగమణి.. ఆగస్టు 31వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తండ్రి జాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. భరత్ తెలిపారు.

బస్సులో బ్యాగు మరిచిన మహిళ..



బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న పరకాల పోలీసులు

పరకాల: తన సోదరుడికి రాఖీ కట్టాలనే ఆరాటంలో ఓ మహిళ బస్సులోనే బ్యాగు మరిచిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఈ విషయం గమనించి పరకాల పోలీసులను ఆశ్రయించింది. వారు స్పందించి వివరాలు సేకరించిన అనంతరం హనుమకొండ బస్‌స్టేషన్‌లో బ్యాగు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అందజేశారు. పరకాల సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన కోయల్ కార్ బీనా బాయ్ తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద సోదరుడి వద్దకు వెళ్లి రాఖీ కట్టింది. తిరిగి శాయంపేటలో ఉంటున్న మరో సోదరుడికి రాఖీ కట్టేందుకు హనుమకొండ బస్టాండ్‌కు చేరకుంది. అక్కడ భూపాలపల్లి డిపో బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మందారిపేట స్టేజీ వద్ద దిగి పిల్లలతో కలిసి సోదరుడి ఇంటికి వెళ్తుతుండగా బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె.. పరకాల పోలీసులను ఆశ్రయించింది. బ్యాగులో దుస్తులతో పాటు మూడున్నర తులాల బంగారం ఉన్నట్లు తెలిపింది. దీంతో పరకాల సీఐ వెంకటరత్నం సీసీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు బ్లూకోర్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు. చివరకు భూపాలపల్లి డిపో అధికారుల ద్వారా సంబంధిత బస్సు కండక్టర్ వివరాలు తెలుసుకుని ఫోన్ చేయడంతో ఆయన బ్యాగు బస్సులోనే ఉన్నట్లు తెలిపారు. పోలీసులు వెంటనే హనుమకొండ బస్సు స్టేషన్‌కు చేరకొని బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్న బాధితురాలు పరకాల పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

రెండు కుటుంబాల్లో 'పొగగొట్టం' చిచ్చు..

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ మధ్యకోటలో ఇంటిపై ఉన్న పొగగొట్టం రెండు కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. నా ఇంటిపై పొగ వస్తుందంటే పట్టించుకోవా.. అంటూ ఓ వ్యక్తి పక్కటింటి వారితో గొడవ పడ్డారు. గొడవ పెద్దగా మారింది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఇంటిపైనున్న పొగగొట్టాన్ని ఎట్టకేలకు తొలిగించారు. దీంతో ఆగ్రహంతో ఇరువురు ఘర్షణ పడగా మహిళ చెందిన ఇంటి డోర్లును ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దూడల సంరక్షణతోనే.. 'పాడి' వృద్ధి

- రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి
- పాడిపరిశ్రమతో అధిక లాభాలు
- మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి



ఆవు దూడలు

కాజీపేట: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే దూడల సంరక్షణే కీలకమని, వీటి పెంపకంపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి తెలిపారు. దూడల పెంపకంపై శ్రద్ధ వహిస్తే అధిక లాభాలు పొందొచ్చన్నారు. దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి 'సాక్షి' తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పెంపకమే కీలకం..

దూడలు పుట్టినప్పటి నుంచి ఎదకు వచ్చే వరకు వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. దూడలు బలంగా, ఆరోగ్యంగా ఉండేలా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన దూడకు వెంటనే జున్ను పాలు తాగించాలి. దీంతో దూడలో వ్యాధి నిరోధక శక్తి పెరిగేతే, భవిష్యత్‌లో వాటికి వ్యాధులు సోకకుండా, ఆరోగ్యంగా ఉంటాయి. అయితే అవగాహనా రాహిత్యంతో కొంతమంది రైతులు పాడి పశువుల నుంచి మొత్తం పాలు పితుకుతారు. దీంతో దూడ పాలు సరిపోక నీరసించి, వ్యాధి నిరోధక శక్తి కోల్పోతుంది. అనంతరం వ్యాధుల బారిన పడి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అందుకే రైతులు దూడలకు సరిపడా పాలు అందేలా జాగ్రత్త వహించాలి.

దూడలకు వ్యాప్తి చెందే వ్యాధులు..

దూడల సంరక్షణలో వాటికి పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఇతరత్రా వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా దూడలకు అతిసార, తెల్లపారుడు, న్యుమోనియా, రక్తవిరోచనాలు, కీళ్ల నొప్పులు, బొడ్డువాపు వ్యాధులతో పాటు ఇతరత్రా వ్యాధులు, పరాన్న జీవులతో వ్యాప్తి చెందుతాయి. దూడలు ఎలాంటి రోగాల బారిన పడకుండా చక్కగా పెరిగితే రైతుకు ఆదాయమే. వీటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

మడికొడ పరిధిలో..

మడికొండ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం తదితర పనుల నిర్వహణకు తగినంత సాగునీరు లేకపోవడంతో రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో పాడిపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. దీంతోపాటు వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పులయ్యేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి తేరుకున్న ఈ ప్రాంత రైతులు పాడిపై దృష్టి సారిస్తూ లాభాలు పొందుతున్నారు. ప్రారంభంలో ఒకటి, రెండు ఆవులను కొనుగోలు చేసి పాడిని ప్రారంభిస్తున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఉదయం, సాయంత్రం కొద్ది సమయం పాడి పశువుల కోసం సమయం కేటాయిస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పటికే ఆవులను కొనుగోలు చేసి, పాడితో లాభాలు పొందుతున్న రైతులను గమనిస్తున్న ఇతర రైతులూ పాడి ఆవులను కొనుగోలు చేసి పాడి పరిశ్రమపై ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నారు. దూడలను కాపాడుకుంటూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

వైద్య పరీక్షలు తప్పనిసరి ..

పాడి రైతులు పుట్టిన దూడల పెంపకంపై జాగ్రత్త వహించకుండా పాలిచ్చే ఆవులపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. లేగదూడలు పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బొడ్డు కోసే సమయంలోనూ జాగ్రత్త అవసరం. లేగదూడల వయసును బట్టి అవి బలిష్టంగా పెరిగేందుకు సరిపడ పాలు మిగల్చడం ఎంతో ముఖ్యం. దూడలు ఆరోగ్యంగా పెరిగితేనే భవిష్యత్తులో అధిక మొత్తంలో పాలు ఇస్తాయి. దీంతోపాటు పాడి ఆవుకు ఆరోగ్యరమైన సమస్యలు తలెత్తవు. పెంపకంలో ఎలాంటి అనుమానం తలెత్తిన వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించాలి. అనుమానాన్ని నివృత్తి చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలి. లేకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. పాడిపశువుల విషయంలో పరిశుభ్రత చాలా ముఖ్యమైందని పెంపకందారులు గుర్తించాలి.